



ఆదరణ కరువై.. బతుకు బరువై..

- ఆధునికతతో మాయమైన దశాబ్దం నాటి వెలుగులు
- జీవన పోరాటం చేస్తున్న చిందు కళాకారులు
- ఆరునెలలు రంగుల ప్రపంచం.. ఆపై ఉపాధి పోరాటం
- ఆర్థికంగా అవస్థలు ఎదుర్కొంటున్న కుటుంబాలు
- అభివృద్ధికి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్

7



ఇటీవల నెక్కొండలో ప్రదర్శన ఇస్తున్న చిందు కళాకారులు

సండే స్పెషల్ SUNDAY SPECIAL

మహా భారతం, రామాయణం, పాండవ వనవాసం, సతీసావిత్రి, భక్త ప్రహ్లాద, శ్రీకృష్ణార్జున యుద్ధం, శివగంగ కల్యాణం, అల్లిరాణి, బసవపురాణం, మాదలిక చరిత్ర లాంటి అనేక పురాణ, ఇతిహాసాలను నిరక్షరాస్యులకు సైతం అర్థమయ్యేలా ప్రదర్శించడం చిందు కళాకారుల నైపుణ్యానికి నిదర్శనం. ఆడుతూ.. పాడుతూ.. నవ్విస్తూ.. వీక్షకులను కనువిందు చేస్తూ చరిత్రను కళ్లకు కట్టినట్టు చూపడం వారి చతురత. తొలినాళ్లలో కాలక్షేపంగా వారు ప్రారంభించిన కళ.. వృత్తిగా మారింది. విశేష జనాదరణ పొందింది. కానీ ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానం పెరిగి.. అంతర్జాలం అరచేతిలోకొచ్చి జీవితాలను శాసిస్తున్న నేటి రోజుల్లో ఆ చిందు కళ గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటోంది. బుల్లితెర, వెండితెర ప్రపంచం అంతగా తెలియని రోజుల్లో ఎనలేని ప్రజాదరణ పొందిన చిందు కళలను నమ్ముకున్న కుటుంబాలు నేడు రోడ్డున పడుతున్నాయి. పాత తరం వారి తరహాలోనే ఇప్పుడూ ఆరునెలల పాటు అడపాదడపా ప్రదర్శనలిస్తున్నా వచ్చే సొమ్ములు రోజువారీ ఖర్చులకే సరిపోతున్నాయి. దీంతో మిగిలిన ఆరునెలలు బతుకుదెరువు కోసం కూలిపనులకు వెళుతున్నారు. ఇక వారి పిల్లలైతే ఉన్నత చదువులకు దూరమవుతూ.. చిందు కళను కొనసాగించలేక అయోమయ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.

- నెక్కొండ, ఆంధ్రజ్యోతి

గ్రూప్-3 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- భూపాలపల్లి, ములుగు కలెక్టర్లు

భూపాలపల్లి కలెక్టరేట్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఈనెల 17,18 తేదిల్లో జరుగనున్న గ్రూప్-3 పరీక్ష నిర్వహణకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ రాహుల్‌శర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష నిర్వహణకు జిల్లాలో 17 పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేసినట్లు పేర్కొన్న కలెక్టర్ 3,707 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. పరీక్షకు హజరయ్యే అభ్యర్థులు టిజిపిఎస్సీ నిబంధనలు పాటించాలని సూచించారు. ఉద్యోగ సాధనకు చాలా కష్టపడి సన్నద్ధం కావాలన్నారు. పరీక్ష నిర్వహ ణకు 17 మంది పరిశీలకులు, 34 మంది బయోమెట్రిక్ ఇన్విజిలేటర్లు, ఒక బయోమెట్రిక్ సూపర్‌వైజర్, 5 రూట్ అధికారులను నియమించినట్లు పేర్కొన్నారు. విధులు కేటాయించిన సిబ్బంది ఉదయం 7 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు. దివ్యాంగ అభ్యర్థుల కోరకు ప్రత్యేక గదులను కేటాయించాలన్నారు. ఈనెల 17వ తేదిన ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటలవరకు మొదటి పేపర్, సాయంత్రం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు రెండవ పేపర్ పరీక్ష ఉంటుందన్నారు. పరీక్షకు అరగంట ముందే పరీక్షల కేంద్రాల గేట్లను మూసివేయాలన్నారు. అలాగే 18వ తేది 8.30 నుండి పరీక్ష కేంద్రాలకు అనుమతి ఉదాని 9.30 గంటలకు గేట్లు మూసివేయనున్నట్లు తెలిపారు.



బందోబస్తుకు 150 మంది పోలీసులు

భూపాలపల్లి కృష్ణకాలనీ, (ఆంధ్రజ్యోతి): గ్రూపు-3కి పరీక్ష ప్రశాంత నిర్వహణకు పోలీసు శాఖ సన్నద్ధమైంది. జిల్లా కేంద్రంలో ఆదివారం, సోమవారం రెండు రోజుల పాటు జరిగే ఈ పరీక్ష నిర్వహణకు అధికార యంత్రాంగం పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేసింది. జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే ఆదేశాలతో పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తమయ్యారు. బందోబస్తులో మొత్తంగా 150 మంది పోలీసులు పాల్గొననున్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో బందోబస్తులో పాల్గొననున్న పోలీసులకు అదనపు ఎస్పీ దిశానిర్దేశం శనివారం చేశారు. అదనపు ఎస్పీతో పాటు ఇద్దరు డీఎస్పీలు 8 మంది సీఐలు, 20 మంది ఎస్సైలు, 119 మంది మెన్, ఉమెన్ కానిస్టేబుళ్ల ప్రత్యేక బందోబస్తులో పాల్గొనున్నట్లు తెలిసింది. జిల్లా కేంద్రంలో గ్రూపు-3 పరీక్షకు సంబంధించి మొత్తంగా 17 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, పాఠశాలలు ఉన్నాయి. ఈ కేంద్రాలకు 200 మీటర్లలోపు 144 సెక్షన్‌లు అమలులో ఉండనుంది.

సర్వం సిద్ధం

ములుగు కలెక్టరేట్, (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-3 పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు కలెక్టర్ టీఎస్.దివాకర శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో తొమ్మిది సెంటర్లను ఏర్పాటు చేయగా మొత్తం 2173మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారని, ఇందులో 750మంది పురుషులు, 1422మంది మహిళలు, ఒకరు ట్రాన్స్‌జెండర్ ఉన్నట్లు తెలిపారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు నోడల్ ఆఫీసర్, రీజినల్ కోఆర్డినేటర్, పోలీస్ నోడల్ ఆఫీసర్, ఇద్దరు రూట్ ఆఫీసర్లు, ఆరుగురు జాయింట్ రూట్ ఆఫీసర్లు, ముగ్గురు ఫ్లయింగ్‌స్క్వాడ్‌లు, చీఫ్ సూపరింటెండెంట్లు, అబ్జర్వర్లు, డిపార్టుమెంట్ ఆఫీసర్లు, ఇన్విజిలేటర్లు, బయోమెట్రిక్ ఇన్విజిలేటర్లు, ఐడెంటిఫికేషన్ ఆఫీసర్లు, ఫ్రెస్కింగ్ స్టాఫ్, పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడమైనదని అన్నారు. దీంతోపాటు జిల్లా కలెక్టరేట్‌లో మానిటరింగ్ సెల్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని, పరీక్ష రాసే అభ్యర్థులు ఇటీవలి పాస్‌పోర్టు సైజు ఫొటో అంటించిన హాల్‌టికెట్, బ్లూ లేదా బ్లాక్ పెన్ను, ఐడెంటిఫికేషన్ ప్రూఫ్ తీసుకుని రావాల్సి ఉంటుందని అన్నారు. ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులైన మొబైల్‌ఫోన్, బ్లూటూత్, క్యాలిక్యులేటర్, గడియారాలు, ఆభరణాలు, షూస్, టోపీ, తదితరాలు తీసుకురావద్దని అన్నారు. పరీక్ష సమయాల్లో ప్రత్యేకంగా హనుమకొండ నుంచి నాలుగు, ఏటూరునాగారం నుంచి నాలుగు బస్సులు అదనంగా నడపాలని ఆయన ఆర్టీసీ అధికారులకు సూచించారు.

ధర్నాను విజయవంతం చేయాలి

భూపాలపల్లిటౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 18 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నా కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్తూరి రవీందర్‌మహరాజ్ పిలుపునిచ్చారు. పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన వాల్‌పోస్టర్‌ల విడుదల కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు అయ్యిందని, అలాగే తెలంగాణ రాష్ట్రంలో మూడున్నర కోట్లమంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు ఉన్నారని అన్నారు. కానీ ఇప్పటివరకు వారికి అందే ఫలాలు సక్రమంగా అందకపోగా దోపిడీకి గురవుతున్నారని అన్నారు. ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు కలెక్టర్, తహసీల్దార్‌లకు వినతి పత్రాలు ఇవ్వడం జరుగుతుందని, అలాగే 25న కలెక్టరేట్ ముందు ధర్నా, అనంతరం 27, 28 తేదీలలో తహసీల్దార్ కార్యాలయాల ముందు ధర్నా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. కాగా ఈ కార్యక్రమాల్లో సబ్బండ వర్గాలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కండె రవి, చిట్యాల శ్రీనివాస్, జితేందర్, నరసింహ, స్వామినాథన్, దశరథం, రాజు, శ్రీకృష్ణ, ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

జనసంద్రంగా..
బుగులోని జాతర
6లో
కాళేశ్వరంలో
కాలసర్ప దోష పూజలు



ముఖాముఖి

శ్రీనివాస్ ములుగు ఆర్టీవో

రోడ్డు భద్రతను పాటించాలి..

- బరగడి శ్రీనివాస్ - ములుగు ఆర్‌టీవో

ఆంధ్రజ్యోతి : జిల్లాలో ఎన్ని వాహనాలున్నాయి..?

ఆర్‌టీవో : జిల్లాలో మొత్తం 53,122 వాహనాలున్నాయి. వీటిలో 2216గూడ్స్ వాహనాలు, 6927ట్రాక్టర్‌లు, 36,930ద్విచక్ర వాహనాలు, 106స్కూల్ బస్సులు, 239హార్వెస్టర్‌లు ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి : కార్యాలయంలో పౌరసేవలు ఎలా ఉన్నాయి..?

ఆర్‌టీవో : ఆర్టీవో కార్యాలయంలో పౌరసేవలను సక్రమంగా, పారదర్శకంగా అందిస్తున్నాము. వెయిటింగ్ రూమ్, మంచినీరు, వాష్‌రూమ్‌లను ఏర్పా టు చేశాం. నిర్ణీత కాల వ్యవధిలో లైసెన్స్‌లు, పర్మిట్‌లు, రిజిస్ట్రేషన్‌లు చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్నారా..?

ఆర్‌టీవో : రోడ్డు భద్రత నియమాలను ప్రతీ ఒక్కరు పాటించేలా చర్యలు తీసుకుంటున్నాం. సీట్ బెల్ట్, హెల్మెట్ ధరించడం, ట్రిపుల్ రైడింగ్, ఓవర్‌స్పీడ్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం. మండలాల వారిగా స్పెషల్ డ్రైవ్‌ను ఏర్పాటు చేస్తున్నాం. ద్విచక్రవాహనదారులు, డ్రైవర్‌లకు అవగాహన కల్పిస్తున్నాం. 18ఏండ్లు నిండిన వారు లైసెన్స్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఆంధ్రజ్యోతి : ఓవర్ లోడ్‌పై చర్యలు తీసుకుంటారా..?

ఆర్‌టీవో : ములుగు జిల్లాలో ఇసుకను తరలిస్తున్న లారీల రాకపోకలు అధికంగా ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ఓవర్ లోడ్‌తో వెళ్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. పోలీసు శాఖ సహకారంతో ఆకస్మిక తనిఖీలు చేపట్టి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి : స్కూల్ బస్సులు ఫిట్‌గా ఉన్నాయా..?

ఆర్‌టీవో : విద్యాసంవత్సరం ప్రారంభంలోనే అన్ని ప్రైవేటు విద్యాసంస్థలకు సంబంధించిన బస్సుల ఫిట్‌నెస్‌ను పరీక్షించడం జరిగింది. సంస్థల యజమానులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నాం. ఆకస్మిక తనిఖీలు కూడా జరిపి ఫిట్‌నెస్ లేకుంటే చర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి : కాలంచెల్లిన వాహనాల మాటేమిటి..?

ఆర్‌టీవో : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నేషనల్ స్క్రాప్ పాలసీ త్వరలోనే రాష్ట్రంలో అమలయ్యే అవకాశాలున్నాయి. పాత వాహనాన్ని లైసెన్స్ డీలర్‌కు అమ్మితే కొత్త వాహనం కొనుగోలు సమయంలో రాయితీలు లభిస్తాయి. ప్రైవేటు వాహనదారులు ప్రతీ మూడునెలలకోసారి ట్యాక్స్ చెల్లించాలి. లేకుంటే భారీ జరిమానాను ఎదుర్కోవాల్సి వస్తుంది.

- ములుగు కలెక్టరేట్ (ఆంధ్రజ్యోతి)

19న ప్రజాపాలన విజయోత్సవ సభ



ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో సభ ఏర్పాట్లు పరిశీలిస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు, అధికారులు



- హనుమకొండలో లక్షకుపైగా మహిళలతో నిర్వహణ
- ఇక బీఆర్‌ఎస్ మాయం.. బీజేపీకి అధికారం దక్కదు
- నిరుపేదల జీవన, ఆర్థిక ప్రగతి కోసమే కుల సర్వే
- మీడియా సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్
- సభ నిర్వహణపై ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలతో సమావేశం

వివరాలు 7లో..

కాళేశ్వరంలో ఘనంగా దీపోత్సవం



ఆలయంలో దీపోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

మహదేవపూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం శనివారం సామూహిక దీపోత్సవ కార్యక్రమం, ఆకాశ దీపాన్ని వెలిగించుట ఘనంగా నిర్వహించారు. కాళేశ్వర ముక్తీశ్వ రస్వామి దేవస్థానంలో ప్రధాన అర్చకులు టి. కృష్ణమూర్తి ఆధ్వర్యంలో భక్తులతో సామూహిక దీపోత్సవాన్ని చేపట్టారు. మహిళలకు దీపాలు, వత్తులు, నూనె, ఇతర పూజా సామాగ్రిని ఆలయం నుంచే ఉచితంగా అందజేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ

- ఒకరి మృతి.. ఇద్దరి పరిస్థితి విషమం


నగేష్ (ఫైల్)

ఏటూరునాగారం రూరల్, నవంబరు 16: 163వ జాతీయ రహదారిపై వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి మరో ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటనలో మత్స్యకారుడు మృతి చెందాడు. ఈ సంఘటన ఏటూరునాగారం మండలంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... మండల కేంద్రంలోని ఓడవాడకు చెందిన గగ్గూరి నగేష్(45)అనే మత్స్యకారుడు ఈనెల 15వ తేదీన సాయంత్రం 4 గంటలకు చేపల కోసం గోదావరిలోకి వల వేసేందుకు వెళ్లి అక్కడ పనిపూర్తి చేసుకొని ఇంటికి తిరిగొచ్చాడు. అనంతరం మరల చేపల వేటకు అదేరోజు రాత్రి 11.30లకు తన ద్విచక్ర వాహనంపై ఇంటి నుంచి 163వ జాతీయ రహదారిపై గోదావరిలోకి వెళ్తున్నాడు. ఈ క్రమంలో రొయ్యూర్ పెట్రోల్ బంక్ సమీపంలోకి చేరుకోగానే శంకరాజుపల్లి గ్రామానికి చెందిన హరి, సాయిల ద్విచక్ర వాహనం ముందు వెళ్తున్న వాహనాన్ని వేగంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో గగ్గూరి నగేష్ కిందపడగా తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మరొక వాహనంపై వెళ్తున్న హరి, సాయిలకు గాయాలు కాగా వెంటనే మండల కేంద్రంలోని సామాజిక ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఇద్దరిని వరంగల్ ఎంజీఎంకు తరలించారు. మృతుడికి భార్య సుమలత, కూతురు కావ్య, కుమారుడు రవితేజ ఉన్నారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

దోష నివారణ పేరుతో మోసం

- కేసులో ఐదుగురిని అరెస్టు చేసిన పోలీసులు


నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

జనగామ రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): దోష నివారణ పూజల పేరుతో మోసం చేసిన నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్ తెలిపారు. శనివారం జనగామ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో డీసీపీ మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ట్రాన్స్‌జెండర్ (హిజ్రా) బట్టు నాగదేవి జనగామకు చెందిన పాముకుంట్ల సందీప్ అనే వ్యక్తిని వివాహం చేసుకొని కొంత కాలంగా జనగామలో ఉంటోంది. బిక్షాటన చేస్తూ జీవనాన్ని కొనసాగిస్తున్న నాగదేవి ఈజీగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో దోష నివారణ పూజలు చేసే మాంత్రికురాలి అవతారమెత్తింది. ఈ క్రమంలో జనగామకు చెందిన ఉప్పల సిరివెన్నెల అనే మహిళ ఇంట్లో దోషం ఉందనిచెప్పి, నివారణ పూజలు చేస్తానని నమ్మబలికింది. పూజల నిర్వహణకు గాను బాధితురాలి నుంచి విడతల వారీగా రూ.55లక్షల నగదు వసూలు చేసింది. ప్లాట్ డాక్యుమెంట్లను తీసుకొని మోసం చేయడంతో బాధితురాలు ఈనెల 13న పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. కాగా శనివారం స్థానిక నెహ్రూ పార్కు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా వారిని గుర్తించి నాగదేవి, సందీప్‌తో పాటు వారికి సహకరించిన మెతుకు గణేష్, నవీన్, భూక్యా గణేష్ అనే నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.21.60 లక్షల విలువైన 30 తులాల బంగారు ఆభరణాలు, రూ.16 వేల విలువైన 20 తులాల వెండి ఆభరణాలు, రూ.10లక్షల విలువైన ప్లాట్ డాక్యుమెంట్లు, ఒక ఎర్టిగా కారును స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు డీసీపీ తెలిపారు. నిందితులను పట్టుకోవడంతో ప్రతిభ కనబరిచిన సీఐ దామోదర్‌రెడ్డి, సిబ్బందిని వరంగల్ సీపీ అంబర్‌కిషోర్ ఝా అభినందించినట్లు తెలిపారు. సమావేశంలో ఏసీపీ పార్థసారధి, పోలీసులు పాల్గొన్నారు.

కేటీకే 6వ గనిని సందర్శించిన జీఎం

కాకతీయఖని, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి సింగరేణి ఏరియాలో కేటీకే 6వ గనిని జీఎం రాజేశ్వర్‌రెడ్డి శనివారం సందర్శించారు. బొగ్గు ఉత్పత్తి, కార్మికుల హాజరుశాతం, కార్మికులు పాటిస్తున్న రక్షణ చర్యలు వంటి విషయాలపై ఆరా తీశారు. రక్షణ చర్యలు పాటిస్తూ బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సింగరేణి అధికారులు పాల్గొన్నారు.

జీడికల్ అంటే మాకెంతో ఇష్టం

- కిలోమీటర్ వరకు మద్యం, మత్తు పదార్థాలు విక్రయించొద్దు
- ఏడాదిలోగా జీడికల్ రూపురేఖలు మార్చేస్తా..
- రూ.50 లక్షల నిధులతో యుద్ధప్రాతిపదికన అభివృద్ధి పనులు
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి


జీడికల్ గుట్టపైనున్న గుండాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కడియం

లింగాలఘణపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జీడికల్ పుణ్యక్షేత్రం అంటే మాకెంతో నమ్మకం, ఇష్టం, మా నాయన పుట్టు వెంట్రుకలు కూడా ఇక్కడే తీశారు.. ఆలయ పవిత్రతను కాపాడేందుకు కిలోమీటర్ దూరం వరకు మద్యం, మత్తు పదార్థాల విక్రయాలు జరగొద్దని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. శనివారం సుప్రసిద్ధ జీడికల్ దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సెంట్రల్ లైటింగ్ సిస్టంను ప్రారంభించిన కడియం బ్రహ్మోత్సవాల సందర్భంగా అధికారులు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను, ఆలయ మాడవీధులు, గుట్టపై ఉన్న గుండాలు, కల్యాణమండపంలో చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. పలు శాఖల జిల్లా స్థాయి అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈనెల 2న కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సూచించిన అభివృద్ధి పనుల పురోగతిపై నివేదికనకు తెలుసుకున్నారు.

ఎమ్మెల్యే మాట్లాడుతూ కేవలం 15 రోజుల్లోనే రూ.50 లక్షల నిధులు కేటాయించగా అధికారులు యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టడం అభినందనీయమన్నారు. జనగామ- జీడికల్ రోడ్డు, బండ్లగూడెం- జీడికల్ రోడ్డు అభివృద్ధికి నిధులు కేటాయించి అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, అదనపు విద్యుత్‌లైన్ల ఏర్పాటు, సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు, తాగునీటి, శానిటేషన్ తదితర పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టడం జరిగిందన్నారు. వచ్చే ఏడాదిలోగా గుట్టపైనున్న గుండాల వరకు మెట్ల నిర్మాణం, భక్తుల వసతిగదులు, ఆర్నెళ్లలో రూ.16కోట్లతో బీటీ రోడ్ల నిర్మాణం చేపట్టి జీడికల్ రూపురేఖలను పూర్తిగా మారుస్తానన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో గోపీరామ్, ఈవోలు వంశీ, లక్ష్మీప్రసన్న, కెకె రాములు, డీపీఓ స్వరూప, విద్యుత్ శాఖ ఎస్ఈ వేణుమాధవ్, డీఈ లక్ష్మీనారాయణ, డీఎంహెచ్‌వో మల్లికార్జున్ రావు, ఏసీపీ భీమ్‌శర్మ, సీఐ శ్రీనివాస్‌రెడ్డి, తహసిల్దార్ అండాలు, ఎంపీడీవో జలంధర్‌రెడ్డి, డీఈ రవీందర్, గుడి వంశీధర్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ శివకుమార్ పాల్గొన్నారు.

వేములవాడలో ఇనుగుర్తి డ్రైవర్ మృతి

- 'జీపు సూరయ్య'కు చివరి శ్వాస కూడా వాహనంలోనే..



ఇనుగుర్తి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన డ్రైవర్ ఓరుగంటి సూరయ్య(62) వేములవాడలో తన వాహనంలో నిద్రిస్తూనే మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం. ఇనుగుర్తి శివారు లాలుతండాకు చెందిన ఓ కుటుంబం సూరయ్యకు చెందిన వాహనాన్ని అద్దెకు తీసుకొని వేములవాడకు శుక్రవారం సాయంత్రం వెళ్లారు. సూరయ్య భార్య భారతమ్మ శనివారం పలుమార్లు ఆయనకు ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. దీంతో భారతమ్మ లాలుతండాకు చెందిన కుటుంబానికి సమాచారం అందించారు. ఈమేరకు సూరయ్య వాహనాన్ని వారు వెతకగా మధ్యాహ్నం 3గంటల ప్రాంతంలో పార్కింగ్ స్థలంలో గుర్తించారు. వాహనంలోనే సూరయ్య కదలకుండా ఉండడంతో స్థానికుల సహాయంలో వాహనం తలుపులను తెరిచి చూడగా ఆయన మృతి చెంది ఉన్నాడు. వాహనంలోనే నిద్రలో గుండెపోటుతో ఆయన మృతి చెందినట్లు భావిస్తున్నారు. ఆయన భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. 40 ఏళ్ళుగా జీపు నడిపించడంతో ఆయన్ను 'జీపు సూరయ్య'గా పిలుస్తారు. అలాంటి జీపు సూరయ్య తన వాహనంలోనే ఆయన చివరి శ్వాస విడవడంతో గ్రామంలో విషాదం నెలకొంది.

హేమాచల క్షేత్రంలో భక్తుల సందడి


సుందరంగా అలంకరించిన స్వామి వారి మూలవిరాట్

మంగపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లూరు హేమా చల కొండలపై వెలిసి ఉన్న ఆదిలక్ష్మీ, చెంచులక్ష్మి సమేత లక్ష్మీనర్సింహస్వామి క్షేత్రానికి శనివారం భక్తులు భారీ ఎత్తున తరలివచ్చారు. వరంగల్, ఖమ్మం, విజయవాడ, విశాఖపట్టణం, కాకినాడ, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి సుమారు 2వేల మంది భక్తులు తరలివచ్చారు. ముందుగా చింతామణి జలధారల వద్ద పవిత్రమైన స్నానాలు ఆచరించి జలాంజనేయ స్వామి, పంచముఖాంజనేయ స్వామి, వేణుగోపాలస్వామి, రమ సత్యనారాయణ స్వామిలను భక్తులు దర్శనాలు చేసుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కొండపై వెలిసియున్న స్వయంభు పుట్టుస్వామిగా విరాజిల్లుతున్న లక్ష్మీనర్సింహా స్వామి, పక్కనే ఉన్న ఆదిలక్ష్మీ, చెంచులక్ష్మీ దేవతలను భక్తులు పోటిపడి దర్శనాలు చేసుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు కైంకైర్యం రాఘవాచర్యులు, ముక్కమల్ల రాజశేఖరశర్మల ఆధ్వర్యంలో అర్చకులు పవన్‌కుమారాచార్యులు, ఈశ్వర్‌చంద్‌శర్మలు స్వామి వారి మూలవిరాట్‌కు తిలా, తైలాభిషేకం చేసి వస్త్రాలు, గజమాలతో సుందరంగా అలంకరించారు. ఆలయ విశిష్టత, స్వామి వారి చరిత్రను భక్తులకు వివరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రవణపు సత్యనారాయణ, అర్చక, ఉద్యోగులు పాల్గొన్నారు.

కాళేశ్వరంలో కాలసర్ప దోష పూజలు

మహదేవపూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన కాళేశ్వర ముక్తీశ్వర ఆలయంలో కార్తీకమాసం శనివారం పురస్కరించుకుని భక్తులు కాలసర్ప దోష పూజలు, నవగ్రహ పూజలు, లక్ష పత్రి పూజలు, లక్ష వత్తుల పూజలతో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచే గోదావరిలో కార్తీక స్నానాలు ఆచరించి స్వామి వారిని దర్శించుకున్నారు. దూర ప్రాంతాల నుండే కాకుండా ఛత్తీస్‌గఢ్, మహా రాష్ట్ర నుంచి వేల కొలది భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.


కాళేశ్వరంలో కాలసర్ప దోష నివారణ పూజలు చేస్తున్న భక్తులు

న్యూస్ బాక్స్

నేడు మానుకోటలో రాష్ట్ర స్థాయి కరాటే పోటీలు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని గిరిజన భవనంలో ఆదివారం రాష్ట్రస్థాయి షోటోఖాన్ కరాటే పోటీలు నిర్వహిస్తున్నట్లు మానుకోట కరాటే అకాడమీ చైర్మన్ వీరునాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు తెలంగాణలోని 13 జిల్లాల నుంచి 1100 మంది క్రీడాకారులు పాల్గొననున్నట్లు తెలిపారు. క్రీడాకారుల సంఖ్యకు అనుగుణంగా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ హాజరు కానున్నట్లు తెలిపారు. న్యాయ నిర్ణేతలుగా షోటోఖాన్ రాష్ట్ర అధ్యక్షుడు ఊరుకొండ చంద్రశేఖర్, తెలంగాణ పోలీస్ కరాటేకోచ్ పాయం సురేష్, సీనియర్ కరాటే మాస్టర్లు కాసింషేక్, గఫూర్, బాపురావులు వ్యవహరించనున్నారని పేర్కొన్నారు.

కులగణన సిబ్బందికి పారితోషికాన్ని ప్రకటించాలి

- పారితోషికం ప్రకటించకుంటే సర్వే నిలిపివేస్తాం


మాట్లాడుతున్న సుధాకరాచారి

తొర్రూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన కులగణన సర్వే చేస్తున్న ఎన్యుమరేటర్లకు, సూపర్‌వైజర్లకు ఇచ్చే పారితోషికాన్ని వెంటనే ప్రకటించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు కె.సుధాకరాచారి అన్నారు. శనివారంతొర్రూరులో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పారితోషికం పట్ల స్పష్టమైన జీవో విడుదల చేయకుండా వ్యవహరిస్తుందని, సర్వేలో పనిచేస్తున్న వారికి పారితోషికం విషయంలో నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. సర్వే ప్రారంభమై పది రోజులైనా పారితోషికంపై జీవో విడుద ల చేయాలని డిమాండ్ చేశారు. లేనిచో సర్వే నిలిపివేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సర్వేలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల హోదాలను బట్టి పారితోషికం అందించాలని, క్షేత్ర స్థాయిలో సిబ్బంది అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రభుత్వం గుర్తించాలన్నారు. ఒక్కో కుటుంబానికి 40 నిముషాల సమయం కేటాయించి వ్యయ ప్రయాసలకు గురవుతున్నారని, ప్రభుత్వం సమయాన్ని పొడిగించాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ డీఏలను విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో చంద్రప్రకాశ్, రవిరాజు, యాకూబ్‌రెడ్డి, రాజేష్ పాల్గొన్నారు.

జనసంద్రంగా.. బుగులోని జాతర


కొండపైకి ఎక్కుతున్న భక్తులు


శివలింగానికి పూజలు చేస్తున్న భక్తులు

రేగొండ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుగులోని వెంకటేశ్వర స్వామి జాతర శనివారం భక్త జనంతో నిండిపోయింది. బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామి వారికి భక్తులు ఏనుగ వాహనాలు, మేక, గుర్రం వాహనాలతో ఊరేగింపుగా వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం బంధువులు, కుటుంబ సభ్యులతో కలిసి విందులు చేసుకుని ఆనందంగా గడిపారు. జాతరలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా జాతర కమిటీ చైర్మన్ వెంకటస్వామి, ఈవో శ్రీనివాస్‌లు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎస్సై సందీప్‌కుమార్ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. శాసన మండలి ప్రతిపక్షనేత స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

భక్తుల అసహనం

మెట్లపై నుంచి దైవ దర్శనానికి వెళ్ళే భక్తులు తీవ్ర అవస్థలు పడ్డారు. పిల్లలతో ఎక్కే భక్తులు తాగునీటికోసం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జాతరలో ఒక వైపు ఎండ మరో వైపు కొండ పైకి ఎక్కే క్రమంలో పిల్లలు దాహంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పూజా సామగ్రి, ఇతర వస్తువుల అమ్మకాల్లో అడుపులేకుండా బుఅమ్మాల్సిన కొబ్బరికాయ రూ.30 నుంచి 40లకు అమ్మడంపై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీఐపీ భక్తుల కోసం ఏర్పాటు చేసిన క్యూలైన్ వల్ల సాదారణ దర్శనం చేసుకునే భక్తులు చాలా ఇబ్బందులు పడ్డారు. ఎడ్ల బండి బోల్తాపడడంతో ఓ భక్తురాలికి గాయాలయ్యాయి. అంబులెన్సులో ఆసుపత్రికి తరలించారు.

భక్తుల సౌకర్యార్థం వసతి షెడ్లు

- మేడారంలో డీపీవో దేవరాజ్

మేడారం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తాడ్వాయి మండలం మేడారం వనదేవతలను దర్శించుకునేందుకు తరలి వచ్చే భక్తుల వసతి షెడ్లను జిల్లా పంచాయితీరాజ్ అధికారి దేవరాజ్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీవో మా ట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం 5 వసతి షెడ్లలో 15మంది ప్రత్యేక పారిశుధ్య సిబ్బందిని పనిలోకి తీసుకోవడం జరిగిందన్నారు. మహా జాతర అనంతరం నాలుగు నెలలుగా జీతాలు చెల్లింపు కాకపోవడంతో పనులు బంద్ చేసిన సిబ్బందిని పూర్తి జీతాలను చెల్లించి పనిలోకి తీసుకోవడం జరిగిందన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం మేడారం పరిసరాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. కార్యదర్శి సతీష్‌తో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది ఉన్నారు.


మేడారంలో భక్తుల వసతి షెడ్లను పరిశీలిస్తున్న డీపీవో దేవరాజ్

అట్టహాసంగా ఈషా గ్రామీణ క్రీడోత్సవాలు


మినీ స్టేడియంలో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

జనగామ కల్చరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో 16వ గ్రామీణోత్సవ క్రీడోత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. శనివారం ఏసీపీ పార్థసారధి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు క్రీడాస్ఫూర్తిని కలిగి ఉండాలన్నారు. గ్రామీణ ప్రాంతాల యువతలో క్రీడాశక్తిని వెలికితీసేందుకే ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రీడోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. క్రీడోత్సవాలలో తొలి రోజు వాలీబాల్ క్రీడలను నిర్వహించగా జిల్లాలోని మొత్తం 12 మండలాల నుంచి 25 టీములు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడా అధికారి వెంకట్‌రెడ్డి, సీఐ దామోదర్‌రెడ్డి, ఈషా ఫౌండేషన్ సభ్యులు జలజ, జ్యోతి, రవిచందర్, శ్రీప్రియ అనిల్ రోహిత్, వ్యాయామ ఉపాధ్యాయులు గోర్‌సింగ్, గంగిశెట్టి మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆదరణ కరువై.. బతుకు బరువై..

- ఆధునికతతో మాయమైన దశాబ్దం నాటి వెలుగులు
- జీవన పోరాటం చేస్తున్న చిందు కళాకారులు
- ఆరునెలలు రంగుల ప్రపంచం.. ఆపైఉపాధి పోరాటం
- ఆర్థికంగా అవస్థలు ఎదుర్కొంటున్న కుటుంబాలు
- అభివృద్ధికి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్



నాటక ప్రదర్శన ఇస్తున్న కళాకారులు (ఫైల్)

నెక్కొండ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆడుతూ.. పాడుతూ.. నవ్విస్తూ.. ప్రేక్షకులను కనువిందు చేస్తూ.. చరిత్రను కళ్లకు కట్టినట్టు చూపుతారు చిందు కళాకారులు. ఒకప్పుడు కాలక్షేపంగా ప్రారంభమైన ఈ కళ.. రానురాను వారి వృత్తిగా మారింది. కానీ ఆ కళ నేటి ఆధునిక ప్రపంచంలో ప్రజాదరణ కరువై కళ తప్పుతోంది. చిందు కళాకారులు ప్రస్తుతం గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటూ జీవనపోరాటం చేస్తున్నారు. సినిమా ప్రపంచం అంతగా తెలియని రోజుల్లో ఎనలేని ప్రజాదరణ పొందిన చిందు కళలను నమ్ముకున్న కళాకారుల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. పాత తరం వారి తరహాలోనే ఇప్పుడూ ఆరునెలల పాటు అడపాదడపా ప్రదర్శనలిస్తున్నా వచ్చే సొమ్ములు రోజువారీ ఖర్చులకే సరిపోతున్నాయి. దీంతో మిగిలిన ఆరునెలలు బతుకు దెరువు కోసం కూలిపనులకు వెళుతున్నారు. ఇక వారి పిల్లలైతే అటు ఉన్నత చదవులకు దూరమవుతూ.. చిందు కళను కొనసాగించే పరిస్థితి కానరాక అయోమయ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. దశాబ్ద కాలం క్రితం ఎక్కువగా దళిత కాలనీల్లో.. ప్రదర్శనలిచ్చిన చిందు కళాకారుల శ్రమను గుర్తించిన దళితులు వారిని ప్రోత్సహించడంతో వారిని ఆహ్లాదపర్చడమే లక్ష్యంగా చిందు కళాకారులు కూడా నాటక రంగానికి శ్రీకారం చుట్టారు. తొలిరోజుల్లో కాలక్షేపానికి ప్రదర్శనలు ఇచ్చిన చిందుకళాకారులు, రానురాను దీనినే వృత్తిగా ఎంచుకుని తమ కళకు పదును పెట్టారు.

మహా భారతం, రామాయణం, పాండవ వనవాసం, సతీ సావిత్రి, భక్త ప్రహ్లాద, శ్రీకృష్ణార్జునయుద్ధం, శివగంగ కల్యాణం, అల్లిరాణి, భసవపురాణం, మాదలిక చరిత్ర లాంటి అనేక పురాణ, ఇతిహాసాలను నిరక్షరాస్యులకు కూడా అర్థమయ్యే రీతిలో ప్రదర్శించే వారు. ఈ ప్రదర్శన సమయంలో అప్పటి ఆధునిక పరిజ్ఞానాన్ని ఉపయోగించిన చిందు కళాకారులు ఇతిహాసాలకు సంబంధించిన పరదాలను నాటకాల సమయంలో స్టేజీలకు వెనుక వైపున మార్చుతూ అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేవారు. అయితే కొంత కాలం తరువాత చిందుకళాకారుల కళలకు ఆకర్షితులైన దళితులతో పాటు ఇతర కులాల ప్రజలు కూడా గ్రామాల్లో ప్రదర్శనలు ఇవ్వాల్సిందిగా కోరేవారు. ఇందుకోసం వారికి ఆర్థిక సాయం చేయడంతో ఆ రోజుల్లో చిందు కళలు ఎంతో ఆదరణ పొందాయి. కేవలం ఆరు నెలల పాటు ప్రదర్శనలిస్తే.. ఏడాదంతా వారి కుటుంబాలకు సాఫీగా జీవనం సాగించేవి.

సండే స్పెషల్ SUNDAY SPECIAL

మూడేళ్లకోసారి ప్రదర్శనలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నెక్కొండ, కేసముద్రం, గూడూరు మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన దాదాపు 20 కుటుంబాలు చిందు కళా ప్రదర్శనలు ఇస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరంతా వరంగల్, కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం ఉమ్మడి జిల్లాల్లో ప్రదర్శనలు ఇస్తుంటారు. వారంతా రోటేషన్ పద్ధతిన మూడు సంవత్సరాలకు ఒకసారి ఆయా జిల్లాలకు వెళ్లి ప్రదర్శనలు ఇవ్వడం ఆనవాయితీగా పెట్టుకున్నారు. ప్రతీ సంవత్సరం జనవరి నుంచి జున్ వరకు చిందుకళాప్రదర్శనలు ఇస్తుంటారు. ఇందుకుగాను ప్రదర్శనలు ఇచ్చిన దళిత కాలనీల్లో కులాల పాలుగా రూ.15వేల నుంచి రూ.20 వేలు ఇచ్చేవారు. ఇదే సమయంలో గ్రామస్థుల కోరిక మేరకు గ్రామాల్లో కూడా ప్రదర్శలు ఇవ్వడంతో ఆర్థికంగా గిట్టుబాటయ్యేది. కానీ, నేడు ఆదరణ తగ్గడంతో వారి జీవనోపాధికి గాను కేవలం దళిత కాలనీల్లోనే మొక్కుబడిగా ప్రదర్శనలు ఇస్తున్నారు.




నెక్కొండలో ప్రదర్శన ఇచ్చిన చిందుకళాకారుల బృందం(ఫైల్)

భారంగా ఆయుధాలు, పరదాల ఏర్పాటు

చిందుకళాకారులు వారి జీవనోపాధి కోసం ఇస్తున్న ప్రదర్శనలు వారిని ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. నాటకాలకు సంబంధించిన ఆయుధాల బొమ్మల తయారీకి, కళాకారుల మేకప్, నాటకల ప్రదర్శన సమయంలో ప్రదర్శించే బొమ్మల పరదాలు, వాయిద్యాల ఏర్పాటు చిందుకళాకారులకు భారంగా మారుతున్నాయి. దీనికి తోడు రవాణా ఖర్చులు కూడా పెరగడంతో కళాకారులందరినీ అన్ని జిల్లాలకు తీసుకుపోవడం కష్టంగా మారింది.

ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం

గడ్డం వెంకటనర్సు, కళాకారుల బృందం అధ్యక్షుడు



వంశపారంపర్యంగా వస్తున్న చిందుకళను నమ్ముకున్న మా కుంటుంబాలు ప్రదర్శనలు ఇచ్చినా, ఆదరించే వారు లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. కొన్ని కుటుంబాలైతే పస్తులుండాల్సిన పరిస్థితి. ఏడాదిలో ఆరు నెలలు ప్రదర్శలు ఇవ్వగా వచ్చే ఆదాయం ఏ రోజుకారోజు పోషణకే సరిపోతుంది. మిగతా ఆరు నెలలు కూలీ పనులను వెతుకోకతప్పడంలేదు. ప్రదర్శనలను ఇవ్వడానికి ఊరూర తిరగడంతో మా పిల్లలు కూడా పెద్ద చదువులు చదువుకోలేదు. అటు ఉన్నతవిద్యకు దూరమై.. ఇటు ఆదరణకు నోచుకోక చిందు కళాకారుల పిల్లలు భవిష్యత్‌లో రాణించలేకపోతున్నారు.

ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

గడ్డం మొగిళి, కళాకారుడు (మహిళా వేషధారణ)



ఆర్థిక ఇబ్బందుల కారణంగా మా పిల్లలు చిందుకళకు దూరంగా ఉంటున్నారు. దీంతో ఈ కళ మా తరం వారతోనే అంతరించిపోయే ప్రమాదం ఉంది. చిందు కళాకారులను ప్రభుత్వం గుర్తించి ఆర్థిక సాయం, ప్రోత్సాహాన్ని అందిస్తే కళ బతుకుతుంది. ఉపాధికోల్పోతున్న కులాలను గుర్తించి వారి ఆర్థికా భివృద్ధికి ప్రభుత్వాలు నిధులను మంజూరు చేస్తున్న తరహాలోనే చిందు కళాకారుల ఆర్థికాభివృద్ధికి ఓ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి.

దక్ష రెడ్డికి బాలకళారత్న అవార్డు



హనుమకొండ కల్చరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రొండ్ల దక్ష రెడ్డికి పన్నెండవ కూచిపూడి ఒలింపియాడ్ -2024లో ప్రతిష్ఠాత్మక బాల కళారత్న అవార్డు లభించింది. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు మూడు రోజుల పాటు గుంటూరులో జరిగిన ఈ కూచిపూడి ఒలంపియాడ్‌లో దక్ష రెడ్డి ఈ అవార్డుకు ఎంపియ్యారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వివిధ విభాగాల సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో ఈ పోటీలు జరిగాయి. ఈపోటీల్లో సీనియర్ విభాగంలో హనుమకొండలోని కనకదుర్గ కాలనీకి చెందిన దీక్ష రెడ్డి ప్రథమ బహుమతి గెలుచుకున్నారు. అలాగే హనుమకొండకు చెందిన శరణ్య, ప్రియ, సబ్ జూనియర్స్ నుంచి వేదాంశి తమ అద్భుతమైన కూచిపూడి నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. బహుమతులు సాధించారు. దక్షరెడ్డిని ప్రతిభకు గుర్తింపుగా బాలకళారత్న అవార్డుతో సత్కరించారు. శరణ్య, ప్రియ, వేదంశిలు కూడా ప్రథమ బహుమతులను, అవార్డులను అందుకున్నారు. ప్రముఖ కూచిపూడి నృత్యగురువు బొంపెల్లి సుదీర్‌రావు శిష్యరికంలో వీరంతా ఈ అవార్డులను సాధించారు.

సుమతిరెడ్డిలో అవిజ్ఞాన్ 3.0 పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశ్రీరెడ్డి

హసన్‌పర్తి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతసాగర్ సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలో ప్రతిఏటా ట్రిపుల్‌ఈ స్టూడెంట్ బ్రాంచ్ ఆధ్వర్యంలో నిర్వహించే నేషనల్ లెవల్ టెక్నో కల్చర్ ప్రోగ్రాం అభిజ్ఞాన్ 3.0 వాల్ పోస్టర్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.రాజశ్రీరెడ్డి శనివారం ప్రోగ్రాం కోఆర్డినేటర్, స్టూడెంట్ బ్రాంచి అడ్వైజర్ మూల రాముతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. విద్యార్థుల్లో విషయ పరిజ్ఞానంతో పాటు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించేందుకే ప్రతీ సంవత్సరం ట్రిపుల్‌ఈ స్టూడెంట్ బ్రాంచి ఆధ్వర్యంలో ఈ వేడుకను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు డాక్టర్ ఇ.సుదర్శన్, డాక్టర్ కె.మహెందర్, ఏవో వేణుగోపాలస్వామితో పాటు విద్యార్థి కోఆర్డినేటర్లు వనపర్తి సహస్ర, వస్త్రాల నందిని, వర్షిత, సౌమిక, సద, స్నేహ, శ్రీజ, చితుర్వ, కమలాక్షిత తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతంటే ప్రాణం





మహబూబాబాద్‌లో వనజీవి రామయ్యతో కలిసి మొక్క నాటుతున్న దైద వెంకన్న (ఫైల్)

- పర్యావరణ పరిరక్షణలో దైద వెంకన్న
- చిన్నతనం నుంచే పలు కార్యక్రమాలు
- 'ఫోన్ కొట్టు.. మొక్క పట్టు'తో ప్రత్యేకత
- పదేళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా 16లక్షల మొక్కల పంపిణీ

• ఆదర్శం

మహబూబాబాద్ టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మొక్కలంటే ఆయనకు అమిత ప్రేమ... ఖాళీ జాగ కన్పిస్తే చాలు మొక్కలు నాటడం.. వాటిని పరిరక్షించడం అలవాటుగా మార్చుకున్నారు. అలా స్వయంగా నాటి, బతికించిన మొక్కలెన్నో ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. ఒక్క మానుకోటలోనే కాదు..రాష్ట్ర వ్యాప్తంగా ఖమ్మం, సూర్యాపేట, నల్లగొండ, హైదరాబాద్, పెద్దపల్లి, సిరిసిల్ల, కరీంగనర్ జిల్లాల్లో పర్యావరణ పరిరక్షణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పిస్తూనే పదేళ్లలో సుమారు 16లక్షల మొక్కలను పంపిణీ చేసి ప్రకృతి తపస్విగా, వన ప్రేమికుడుగా గుర్తింపు పొందాడు మానుకోట జిల్లా కేంద్రానికి చెందిన దైదవెంకన్న. ప్రజా హృదయం స్వచ్ఛంద సేవా సంస్థను స్థాపించి ఓ వైపు సామాజిక సేవ చేస్తూనే మరో వైపు పర్యావరణ పరిరక్షణపై దృష్టిసారించారు. మునిసిపల్ జీవ వైవిధ్య కమిటీ సభ్యులుగా తనవంతు కృషి చేస్తున్నారు. మహబూబాబాద్ జల్లా కేంద్రం సమీపంలోని వేమూనూరు శివారు ఉత్తర తండాను దత్తత తీసుకుని అక్కడ ఐదు వేల మొక్కలు నాటారు. 2018లో రాష్ట్ర ప్రభుత్వం ద్వారా హరితమిత్ర అవార్డుతో మరి కొన్ని అవార్డులు సొంతం చేసుకున్నారు. 2020 సంవత్సరంలో గవర్నర్ రంగరాజన్, అటవీ శాఖ మంత్రి జోగు రామన్న చేతుల మీదుగా దైద వెంకన్న ఆ అవార్డును అందుకున్నారు.

గురువుల స్ఫూర్తితో చిన్నతనం నుంచే..

మహబూబాబాద్ పట్టణానికి చెందిన దైద వెంకన్న ఇందిరానగర్ పాఠశాలలో చదివారు. 1985లో తాను చదువుకునే రోజుల్లో ఆయన గురువులు కృష్ణమూర్తి,షబ్బీర్ విద్యార్థులు మొక్కలు నాటాలని సూచిస్తూ ప్రతీవిద్యార్థికి ఐదు మొక్కలను పంపిణీ చేశా రు. ఆ సమయంలో వెంకన్న నాలుగు జామాయిలు, ఒక చింతచెట్టును నాటి వాటిని సంరక్షించి పెద్దవి చేశాడు. ఇటీవలే తానుపెంచిన చెట్లకు వందనం చేస్తూ నాటి మధుర జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. అలా పర్యావరణ పరిరక్షణపై ఆసక్తి పెంచుకున్న వెంకన్న విద్యార్థులు, ప్రముఖుల జన్మదినోత్సవం, వివాహాది శుభకార్యాలకు మొక్కను బహూకరించి నాటిస్తారు. ఆరేళ్లుగా రాఖీ పౌర్ణమి పర్వదినాన వృక్షాబంధన్‌ను నిర్వహించి మొక్కలకు రాఖీలు కట్టిస్తారు.


'ఫోన్ కొట్టు మొక్క పట్టు'తో ఇళ్ల వద్దకే మొక్కలు..

తెలంగాణ ఆవిర్భావం తర్వాత 2014 నుంచి వెంకన్న మొక్కవోని దీక్షతో పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతున్నారు. ఎవరైనా మొక్కలు కావాలని ఫోన్ చేస్తే ఎంత దూరమైనా సొంత ఖర్చులతో తన ఆటోలో మొక్కలను తీసుకెళ్లి ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ఇందుకోసం తన ఇంటివద్ద అన్ని రకాల మొక్కలను అందుబాటులో పెట్టుకుంటున్నారు. ఆయనే కాదు.. కుటుంబ సభ్యులు కూడా మొక్కలను నాటడడంలో భాగస్వాములవుతారు. 2016, 17 సంవత్సరాల్లో ఉదయాన్నే లేచి మహబూబాబాద్ పట్టణంలో 180 రోజుల పాటు డప్పుచాటింపు ద్వారా మొక్కల పెంపకం.. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ మొక్కలు పంపిణీ చేశారు. ఇటీవల రాష్ట్ర స్థాయి వన ప్రేమికులను మానుకోటకు ఆహ్వానించి సదస్సును ఏర్పాటు చేసి వారి సేవలను శ్లాఘిస్తూ అవార్డులను అందించారు.



2014లో ప్రధాని స్వచ్ఛ భారత్ పిలుపుతో...

ప్రధాని నరేంద్రమోదీ 2014లో స్వచ్ఛభారత్ పిలుపుతో మహబూబాబాద్ పట్టణంలో వన ప్రేమికుడు దైద వెంకన్న 45 రోజుల పాటు పారిశుధ్య నిర్వహణలో భాగస్వాములై కరపత్రాల ద్వారా చైతన్యం నింపారు. పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ నివారణపై అవగాహన కల్పించారు. 2018లో మన్‌కి బాత్‌లో భాగంగా మట్టితో ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఇటీవల మన్‌కి బాత్ కార్యక్రమంలో భాగంగా అమ్మ పేరిట లక్ష మొక్కలు నాటాలనే లక్ష్యం పెట్టుకున్నారు. ఈక్రమంలో పట్టణంలోని నర్సింగ్ కళాశాలలో ఒక్క రోజే విద్యార్థులతో వంద మొక్కలు నాటించారు. మానసిక దివ్యాంగులతో కూడా మొక్కలు నాటించారు. హరిత తెలంగాణే లక్ష్యంగా తీసుకువచ్చిన హరితహారంలో తన వంతు బాధ్యతగా వేలాది మొక్కలు నాటుతూ ఇతరులకు మొక్కలను పంపిణీ చేస్తూ దైద వెంకన్న అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.





ఫొటోలు 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హనుమకొండ

ప్రకృతి గీసిన ముఖచిత్రం

భద్రకాళి గుట్టపై ఆవిష్కృతం

సూర్యోదయ సమయాన.. పసిడి వర్ణంలో ఉదయించిన భానుడి లేలేత కిరణాలు మంచుతెరలను చీల్చుతూ.. ఆకాశమే హద్దుగా నిలిచిన ఆ రాతి గుట్టలను తాకిన వేళ... మనిషి ముఖాన్ని పోలిన ఆకారం ఆవిష్కృతమైంది. పర్యావరణ ప్రేమికులను అమితంగా ఆకట్టుకున్న ప్రకృతి గీసిన ఈ 'ముఖ'చిత్రం శనివారం తెల్లవారుజామున వరంగల్ భద్రకాళి దేవస్థాన ప్రాంగణంలోని భద్రమ్మ గుట్టలపై కనిపించింది. తిరుమల కొండలపై వేంకటేశుని రూపం మాదిరిగానే ఇక్కడ ముఖరూపం కనిపిస్తోంది.

19న ప్రజాపాలన విజయోత్సవ సభ

- హనుమకొండలో లక్షకుపైగా మహిళలతో నిర్వహణ
- మీడియా సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్
- సభ నిర్వహణపై ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలతో సమావేశం
- ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఏర్పాట్ల పరిశీలన



ఉమ్మడి జిల్లా నేతలతో సమావేశంలో మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

హనుమకొండ సిటీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తమ ప్రభుత్వ ఏడాది ప్రజాపాలన సందర్భాన్ని పురస్కరించుకొని ఈనెల 19న హనుమకొండలో విజయోత్సవ సభను నిర్వహించనున్నట్లు టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ వెల్లడించారు. మంగళవారం హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించబోయే విజయోత్సవ సభ ఏర్పాట్ల పరిశీలనకు గాను ఆయన శనివారం హనుమకొండ వచ్చారు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లా ఎంపీలు, ఎమ్మెల్యేలతో పాటు ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. ప్రజాపాలన విజయోత్సవ సభ విజయవంతానికి ప్రతీ ఒక్కరు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. ఒక్కో నియోజకవర్గం వారిగా సభకు తరలించే బాధ్యతలను ఎమ్మెల్యేలు చూసుకోవాలన్నారు. ఆ మేరకు బాధ్యతల విభజన జరగాలని దిశా నిర్దేశం చేశారు. ప్రజాపాలన విజయోత్సవ సభ చరిత్రలో నిలిచేలా ఉండాలని లోపాలు ఉండకూడదని స్పష్టం చేశారు. ఒక్కో నియోజకవర్గం వారిగా ప్రధాన సమస్యలు, ఆ సభలో ముఖ్యమంత్రి ద్వారా వెల్లడింపచేసే అభివృద్ధి పనులు, నిధుల కేటాయింపుల వివరాలను కూడా మహేశ్‌కుమార్‌గౌడ్ చర్చించారు. వరంగల్ నగరంలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, కాళోజీ కళాక్షేత్రం, నయీంనగర్ బ్రిడ్జి ప్రారంభం ఇతర పనుల వివరాలను ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి నుంచి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడారు. 19న లక్షకుపైగా మహిళలతో నిర్వహించబోయే సభకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరవుతారని, ఏడాదిలో కాంగ్రెస్ సర్కారు చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలు, కార్యక్రమాల వివరాలతో పాటు భవిష్యత్‌లో చేపట్టబోయే చర్యలను వెల్లడిస్తామన్నారు. వచ్చే ఎన్నికల నాటికి రాష్ట్రంలో బీఆర్ఎస్ మాయం కానుందని, ప్రజలు ఆ పార్టీకి ప్రతిపక్ష హోదా కల్పిస్తే దానిని అగౌరవపరిచారని, కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు పరిమితం కావడమే ఇందుకు నిదర్శనమన్నారు. మాజీ మంత్రి కేటీఆర్ అవాస్తవాలతో ప్రజలను మభ్యపెట్టే యత్నం చేస్తున్నారని, సోషల్ మీడియాతో నిజాలను వక్రీకరిస్తూ ప్రజలను నమ్మించే కుట్రలు చేస్తున్నాడని దుయ్యబట్టారు. రాష్ట్రంలో మతం పేరిట అధికారంలోకి వచ్చేందుకు బీజేపీ ప్రయత్నాలు చేస్తోందని, ఆ పార్టీ శ్రమ ఎప్పటికీ వృధాయే అవుతుందన్నారు. హైదరాబాద్ భవిష్యత్ కోసం మూసీ ప్రక్షాళన చేస్తుంటే కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అడ్డుకునే చర్యలకు పాల్పడుతున్నారని, బీజేపీ మూసీ నిద్రతో ఒరిగేదేమీ లేదని మండిపడ్డారు. నిరుపేదల జీవన, ఆర్థిక ప్రగతి కోసమే రాష్ట్రంలో కుల సర్వే చేపట్టినట్లు వెల్లడించారు. పార్టీలో ఎలాంటి భేదాభిప్రాయాలు లేవని కొట్టి పారేశారు.

సభా మైదానం పరిశీలన

నేతలు, విలేకరులతో సమావేశం అనంతరం మహేశ్ కుమార్‌గౌడ్ సభ నిర్వహించనున్న ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానాన్ని పరిశీలించారు. వేదిక ఏర్పాటు, గ్యాలరీలు, ప్రజలకు కల్పించాల్సిన సౌకర్యాలు, పార్కింగ్ తదితర అంశాలను చర్చించారు. సీపీ అంబర్ కిషోర్ ఝా, కలెక్టర్లు ప్రావీణ్య, సత్య శారద తదితర అధికారులతో ఏర్పాట్లు, బందోబస్తు గురించి చర్చించారు. సభ వాస్తు ప్రకారంగా జరిగేలా ఏర్పాట్లు ఉండాలనే అభిప్రాయాలను నేతలు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాల్లో ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, ఎంపీలు బలరాంనాయక్, కడియం కావ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, నాగరాజు, గండ్ర సత్యనారాయణ, మురళీనాయక్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, ఈవీ శ్రీనివాస్‌తో పాటు ఉమ్మడి వరంగల్‌లోని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పాల్గొన్నారు.



ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో సభ ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్, మంత్రులు

ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో సమావేశమైన పీసీసీ చీఫ్

ఆర్ట్స్ కళాశాల మైదానం పరిశీలన అనంతరం హనుమకొండ ఎక్సైజ్ కాలనీలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌజ్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ మరోసారి మంత్రులు, కొందరు ఎమ్మెల్యేలతో సమావేశమయ్యారు. ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబులతో కలిసి ఒక్కో ఎమ్మెల్యేతో విడివిడిగా సభ నిర్వహణ అంశాలను చర్చించారు. నియోజకవర్గం వారీగా సభకు తరలించేందుకు జనం, వాహనాల సమీకరణ, సభ నిర్వహణలో నిర్వర్తించాల్సిన బాధ్యతలు, తదితరఅంశాలపై చర్చించారు. ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, నాగరాజు, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, మురళీనాయక్, రాంచంద్రునాయక్‌తో పాటు పలువురు ముఖ్య నేతలతో టీపీసీసీ అధ్యక్షుడు వేర్వేరుగా భేటీ అయ్యారు.

నూతన ఆవిష్కరణలపై అవగాహన పెంచుకోవాలి

- సదస్సులు, సంగోష్ఠులతోనే అవకాశం
- నిట్ డైరెక్టర్ విద్యాధర్ సుబుధీ
- నిట్‌లో ప్రారంభమైన రెండు రోజుల సింపోజియం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నిట్ డైరెక్టర్ విద్యాధర్ సుబుధీ

హనుమకొండ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): శాస్త్ర, సాంకేతిక రంగాల్లో నూతన ఆవిష్కరణల పట్ల పూర్తిస్థాయి అవగాహనను పెంచుకోవడానికి సదస్సులు, సంగోష్ఠులు, వర్క్‌షాపులు ఎంతో దోహదపడతాయని వరంగల్ నిట్ డైరెక్టర్ విద్యాధర్ సుబుధీ అన్నారు. శనివారం వరంగల్ నిట్, ఇండియన్ నేషనల్ ఆకాడెమీ ఆఫ్ ఇంజనీరింగ్ (ఐఎన్ఏఈ) ఆధ్వర్యంలో 18వ నేషనల్ ఫ్రాంటియర్స్ ఆఫ్ ఇంజనీరింగ్ సింపోజియం జరిగింది. నిట్ క్యాంపస్‌లోని అంబేద్కర్ లెర్నింగ్ సెంటర్‌లో ప్రారంభమైన ఈ రెండు రోజుల సంగోష్ఠిని డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి, ఐఎన్ఏఈ వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ శివాజీ చక్రవర్తి, ఎన్ఐటీ వరంగల్ డీన్ (రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్)) ప్రొఫెసర్ శిరీష్ సోనావానే జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా సుబుధీ మాట్లాడుతూ.. నూతన సాంకేతిక ప్రక్రియల సమాచారం ఆదానం ప్రదానం జరిగినప్పుడే రాణించడానికి వీలుకలుగుతుందన్నారు. నిట్‌లో నిర్వహిస్తున్న ఈ సింపోజియం తాజా పరిశోధనలను పంచుకునేందుకు ఎంతో దోహదపడుతుందన్నారు. రెండు రోజు ఈ సదస్సులో సంకలిత తయారీ, ఆటోమేషన్, స్మార్ట్ గ్రిడ్, పవర్ ఎలక్ట్రానిక్ కన్వర్టర్లు, కంట్రోల్ అండ్ ప్రొటెక్షన్, గ్రీన్ హైడ్రోజన్, స్టోరేజీ టెక్నాలజీ, క్వాంటమ్ కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ, మెషిన్ అనే నాలుగు థీమ్‌లలో ప్లీనరీ, కీనోట్ సెషన్లను నిర్వహిస్తారు. ఐఎన్ఏఈ వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ శివాజీ చక్రవర్తి ఇండియన్ నేషనల్ అకాడమీ ఆఫ్ ఇంజనీరింగ్ పరిశోధనా రంగంలో సాగిస్తున్న కృషి, సాధించిన విజయాల గురించి వివరించారు. ప్రొఫెసర్ ఇంద్రనీల్ మన్నా వర్చువల్‌గా తన సందేశాన్ని పంపారు. డీన్ ఆర్ అండ్ డీన్ ప్రొఫెసర్ శిరీష్ సోనవానే సింపోజియంవల్ల వినూత్న ఆవిష్కరణల ఆకళింపునకు వీలు కలుగుతుందన్నారు. వివిధ ఇంజనీరింగ్ సంస్థలకు చెందిన 70 మంది అధ్యాపకులు పరిశోధకులు ఈ సంగోష్ఠికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆదివారం 28 పోస్టర్లను, తయారీ పద్ధతుల్లో ఆవిష్కరణలు ప్రదర్శిస్తారు. ఉత్తమ ఆవిష్కరణలకు రూ.40వేలు, రూ.20వేలు నగదు బహుమతులన అందచేస్తారు.

కుట్టుకూలి డబ్బులు అందలె..

మొగుళ్లపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రెక్కాడితే కాని డొక్కాడని దర్జీలు పాఠశాలల్లోని విద్యార్థులకు ఏకరూప దుస్తు లు కుట్టిన కూలీ డబ్బులు రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని పలు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశా లల్లో బాలబాలికలకు అవసరమైన ఏకరూప దుస్తులు కుట్టేందుకు సెర్ప్ ఆధ్వర్యంలో కొంద రు దర్జీలకు సుమారు 1740 జతల దుస్తులు అప్పగించారు. ఒక్కో జతకు రూ.75 చొప్పున చెల్లిస్తున్నారు. తక్కువ అయినా దర్జీలు మన విద్యార్థులుగా భావించి ఏక రూప దుస్తులను కుట్టి సంబంధిత అధికారులకు అప్పగించారు. అయితే నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు డబ్బులు రాకపోవడంతో వారు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. మొదటి విడతగా కుట్టిన దుస్తులకు డబ్బులు చెల్లించడం జరిగిందని, రెండో విడతలో కుట్టిన దుస్తులకు డబ్బులు వస్తాయోరావోననే సందేహంలో దర్జీలు ఉన్నారు. ఈ విషయమై జిల్లా అధికారులు స్పందించి ఏకరూప దుస్తుల కూలి డబ్బులు చెల్లించాలని దర్జీలు వేడుకుంటున్నారు.

గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు



సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో నారాయణరావు

భూపాలపల్లిటౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని జిల్లా పంచాయతీరాజ్ శాఖ అధికారి నారాయణరావు అన్నారు. భూపాలపల్లి పట్టణంలోని జిల్లా గ్రంథాలయం ఆవరణలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్స వాల సందర్భంగా శనివారం ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు దేశాభివృద్ధిలో గ్రంథాలయాల పాత్ర, నిరుద్యోగం -ఉపాధి అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీపీవో నారాయణరావు హాజరై మాట్లాడారు. గ్రంథాల యాలలో వివిధ రకాల పుస్తకాలు ఉంటాయని అన్నా రు. ప్రతి రోజు విద్యార్థులు ఒక గంట పాటు సమ యాన్ని గ్రంథాలయానికి కేటాయిస్తే అద్భుత జ్ఞానం తమ సొంతం అవుతుందని అన్నారు. భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని అన్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీ వో వీరభద్రయ్య, ఉపాధ్యాయులు రహీంపాషా, శేఖర్, క్రాంతి, కల్పన, గ్రంథాలయ సిబ్బంది చంద్రమౌళి, శారద, రవీందర్, రాకేష్, మంజుల పాల్గొన్నారు.

కొనసాగిన గ్రంథాలయ వారోత్సవాలు

ములుగు కలెక్టరేట్ : ములుగులోని జిల్లా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు మూడోరోజు శనివారం కొనసాగాయి. ఈసందర్భంగా పలువురు కవులు గ్రంథాలయ పితామహుడు ఎస్పీ.రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం దుర్గం సూరయ్య జనరల్ హ్యాండ్‌బుక్కును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా సీనియర్ సిటిజన్ అధ్యక్షుడు, దుర్గం మల్లయ్య వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు, కవి దుర్గం సూరయ్య, కవులు సదయ్య, కొండె శ్రీనివాస్, చల్లగురుగుల రాజు, లెనిన్, హమీద్, నాగేందర్, రాజమౌళి, రాజు, వేములపల్లి కుమార స్వామి, గ్రంథపాలకులు సమ్మక్క, సీనియర్ అసిస్టెంట్ నిఖిల్, కంప్యూటర్ ఆపరేటర్ బి.రాకేష్, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



హ్యాండ్ బుక్కును ఆవిష్కరిస్తున్న కవులు

కొనసాగుతున్న ఇంటింటి సర్వే

మొగుళ్లపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే మండలవ్యాప్తంగా కొనసాగుతోంది. మండలంలోని అన్ని గ్రామాల్లో సుమారు 81మంది ఎన్యుమరేటర్లు ఇంటింటికీ తిరుగుతూ సర్వే కొనసాగిస్తున్నారు. మండల స్పెషలాఫీసర్ సునీత, తహసీల్దార్ సునీత, ఎంపీడీవో హుస్సేన్‌లు సర్వేను పర్యవేక్షిస్తున్నారు. ప్రజల నుంచి పలు సందేహాలు వ్యక్తమవుతున్నప్పటికీ అధికారులు వారి సందేహాలను నివృత్తి చేస్తూ సర్వేను ముందుకు సాగిస్తున్నారు. కులగణన కోసమే ఈసర్వే చేపడితే కులం,మతం ఏమిటోనని తెలుసుకోకుండా సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయాలకు సంబంధించిన 76ప్రశ్నలతో కూడిన ప్రశ్నావళిని రూపొందించి సమాచారం ఎందుకు తీసుకుంటున్నారని సర్వే అధికారులను ప్రజలు ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. ఆస్తుల వివరాలను ఇవ్వడానికి ప్రజలు అనుమానాలు, సందేహాలు వ్యక్తపరుస్తున్నారు. మొత్తం ఎనిమిదిరోజుల్లో మండలంలో 6,421కుటుంబాలను అధికారులు సర్వే చేశారు.

చనిపోయిన మహిళ కళ్ల దానం

కన్నాయిగూడెం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి):ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని బుట్టాయిగూడెం గ్రామానికి చెందిన సునార్కని సమ్మక్క (35) మరణించగా ఆమె నేత్రాలను భర్త సునార్కని సమ్మయ్య దానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. మృతురాలి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బుట్టాయిగూడెంకు చెందిన సునార్కని సమ్మయ్య వృత్తి రిత్యా ఆర్‌ఎంపీ వైద్యుడు. గత కొన్నేళ్లుగా జనగామ జిల్లా రఘునాథపల్లి మండ లం కన్నయ్య పల్లికి కుటుంబంతో సహ వలస వెళ్లి ఆర్‌ఎంపిగా జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం తన సొంత పనుల నిమిత్తం హనుమకొండకు భార్య కూతురుతో కలిసి ద్విచక్ర వాహనం పైన బయలుదేరి వచ్చే క్రమంలో హన్మకొండ మండలం ఖాజీపేట మండలం కడిపి కొండ బ్రిడ్జి వద్ద ఎదురు ఎదురుగా ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. సమ్మయ్య , కూతురుకు స్వల్ప గాయాలు కాగా భార్య సమ్మక్క తలకు బలమైన గాయం కాగా అంబులెన్సు ద్వారా హైదరాబాద్ హస్పిటల్‌కు తరలించి చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలు సమ్మక్క భౌతిక కాయాన్ని వరంగల్ ఎంజీఎం కు తరలించి పోస్టు మర్టం నిర్వహించి నేత్రాలను ఎల్వీ ప్రసాద్ యూనిట్‌లోని రామాయమ్మ ప్రపంచ నేత్రదాన ఫౌండేషన్‌కు భర్త సమ్మయ్య డాక్టర్ లక్ష్మణ్ రావు ఆధ్వర్యంలో దానం చేశారు. కుటుంబ సభ్యులతో పాటుగా జాడి రామారాజు, కుమ్మరి సత్యం తదితరులు ఉన్నారు.

జోరుగా సాగుతున్న ఇసుక అక్రమ రవాణా

మల్హర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి) : మండల వ్యాప్తంగా ఒకటి, అర గ్రామాల్లో మినహా అన్ని గ్రామాల్లో ఇసుక విరివిగా లభించడంతో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతుంది. మండల కేంద్రమైన తాడిచర్ల, వల్లెంకుంట, ఇప్పల పల్లి మానేరు నుంచి ఇసుక అక్రమ రవాణాకు పెట్టింది పేరు. తాడిచర్ల గ్రామం నుంచి భూపాలపల్లికి ఇసుక అక్రమ రవాణా పగలు, రాత్రి జోరుగా సాగుతుంది. తాడిచర్ల మానేరు నుంచి ఇసుకను ట్రాక్టర్లలో కిషన్‌రావుపల్లి అటవీ మార్గం, తాడిచర్ల ఓసీపీ కన్వేయర్ బెల్టు మార్గం గుండా భూపాలపల్లికి తరలిస్తున్నారు. ఒక్కో ట్రిప్పుకు రూ 4 నుంచి 5 వేల వరకు వస్తుండడంతో ట్రాక్టర్లు రోజంతా నడుస్తున్నాయి. ఇప్పలపల్లిలో మానేరులో ప్రవాహం తగ్గగానే పదుల సంఖ్యలో ట్రాక్టర్లు ఇసుకను కాటారానికి తరలిస్తున్నారు. వల్లెంకుంట మానేరు నుంచి కూడ ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. అధికారుల కనుసన్నల్లోనే ఈ దందా సాగుతున్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సిబ్బంది లేరనే సాకుతో అధికారులు ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న దాఖలాలు లేవున. ఫారెస్టులో ఇసుక నిల్వలు ఉంచి అక్రమంగా తరలించినా ఇంతవరకు అధికారులకు తెలియకపోవడం గమనార్హం. అడపాదడపా పోలీసులు దాడులు నిర్వహించి ఇసుక ట్రాక్టర్లను పట్టుకుం టున్నారే తప్ప మిగత అధికారులు మాత్రం ఇసుక అక్రమ రవాణాను మాములుగా తీసుకుంటున్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సామూహిక సత్యనారాయణ వ్రతాలు

ఏటూరునాగారం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో శనివారం సామూహిక సత్యనారాయణ వ్రతాలను ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు యల్లాప్రగడ నాగేశ్వరరావు శర్మ, మణికంట శర్మ ఆధ్వర్యంలో ముందుగా ప్రత్యేక పూజ కార్యక్రమాలు జరిగాయి. అనంతరం సుమారు 50 మంది దంపతులు పూజ కార్యక్రమంలో పాల్గొని వస్త్రాలు, గాజులు, కుంకుమతో వ్రతాలు చేసి ప్రత్యేక పూజలు చేశారు. అంతేకాకుండా పిండి దీపాలు, ఉసిరి దీపాలు, కొబ్బరి దీపాలను వెలిగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

నిబంధనలు బేఖాతరు..

● అనుమతులు రాకముందే తరలింపు

● ప్రైవేట్ పాఠశాల నిర్వాకంపై పలువురి గుర్రు

గణపురం, నవంబరు 16,(ఆంధ్రజ్యోతి): నిబంధనలు బేఖాతరు చేస్తూ ఓ ప్రైవేటు పాఠశాలను ఆ యాజమాన్యం మరోచోటకు తరలించే ప్రక్రియను మొదలుపెట్టింది. అధికారిక అనుమతి రాకముందే మరో చోటుకి మార్చు తుండడంపై స్థానికులు, విద్యార్థి సంఘం నాయకులు, విద్యావంతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకెళితే... గణపురం మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఉన్నత పాఠశాలలో ఒకటి నుంచి పదో తరగతి వరకు విద్యా బోధన చేస్తున్నారు. అయితే ఈ పాఠశాలను మరో చోటుకు మార్చాలని కొద్దిరోజుల క్రితం నిర్ణయించిన యాజమాన్యం అనుమతుల కోసం ఎంఈవో, డీఈవోలకు షిఫ్టింగ్ దరఖాస్తు చేసింది. అయితే ప్రాథమికోన్నత స్థాయి వరకే తరలింపు కోసం అనుమతి రాగా.. ఉన్నత స్థాయి పాఠశాల తరలింపును పెండింగ్‌లోనే ఉన్నట్లు సమాచారం. కానీ యాజమాన్యం ఉన్నత తరగతులను కూడా తరలించే ప్రయత్నం చేయడం సరైంది కాదని విద్యార్థుల తల్లిదం డ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా పాఠశాల షిఫ్టింగ్ చేసే భవన సముదాయంలో సరైన వసతులు లేకపోవడం మూలంగానే అధికారులు అనుమతులు ఇవ్వలేదని సమాచారం. కాగా నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలను మరోచోటుకు తరలించిన యాజమాన్యంపై విద్యా శాఖ ఉన్నతాధికారులు విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

తెల్లకోటు సేవా గుణానికి ప్రతీక : ఎమ్మెల్యే గండ్ర

భూపాలపల్లిటౌన్, నవంబరు 16: వైద్యులు, వైద్య విద్యార్థులు ధరించే తెల్లకోటు రోగుల సంరక్షణ పట్ల నిబద్ధతను సూచిస్తుందని , సేవా గుణానికి ప్రతీక అని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శనివారం మెడికల్ కళాశాల ఆవరణలో తెల్లకోటు వేడుక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్యరంగంలో నూతన ఆవిష్కరణలకు వైద్య విద్యార్థులు శ్రీకారం చుట్టాలని అన్నారు. వైద్యులు, వైద్య విద్యార్థులు ధరించే తెల్లకోటు సేవా గుణం, అంకిత భావం, అభిరుచిని తెలియ జేస్తుందని అన్నారు. అలాగే నిబద్ధతకు ప్రతీక అని అన్నారు. తెల్లకోటు ధరించి ప్రజలకు సేవ చేసే బాగ్యం అందరికీ రాదని, ఇది ఎంతో సేవాభావం ఉంటేగాని ఆ అవకాశం దక్కదని అన్నారు. వారి జ్ఞానం వెలకట్టలేనిదని అన్నారు. తెల్లకోటు వేడుక వైద్య విద్యార్థుల్లో మరువలేని ఘట్టం అని అన్నారు. వైద్య విద్యార్థులు జీవితంలో గొప్ప డాక్టర్లుగా కీర్తించబడాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్, సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.



తెల్లకోటు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గండ్ర

గుంతలమయంగా ప్రధాన రహదారి

కాటారం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి):మండలంలోని కాటారంమంథని ప్రధాన రహదారంతా గుంతలమయంగా తయారైంది. భారీ వర్షాలకు తోడు ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న ఇసుక, బొగ్గు లారీలు, టిప్పర్లతో గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. కిలోమీటర్ మేర రోడ్డు విస్తరణ పనులు సాగుతుండగా కంకరరోడ్డుపై, 12కిలోమీటర్ల మేర ఇతర చోట్ల బీటీ రోడ్డుపై పలు గుంతలు పడటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గోతుల్లో చిన్నకార్లు, ఆటోలు వెళ్తుంటే గోతుల్లో ఇంజన్ తాకి పాడవుతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతలు పూడ్చి రహదారిని బాగు చేయించాలని జనం కోరుతున్నారు.



ప్రధాన రోడ్డుపై ఏర్పడ్డ భారీ గుంతలు

చల్లపల్లిలో కాపర్‌వైర్ చోరీ

కాటారం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి):మండలంలోని రేగులగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని చల్లపల్లి సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టి కాపర్ తీగను ఎత్తుకెళ్లారు. చల్ల శ్రీనివాస్, సతీష్ తదితర రైతులకు చెందిన ట్రాన్స్‌ఫార్మర్ ఇటీవల కాలిపోగా మరమ్మతుల అనంతరం శుక్రవారం తిరిగి పొలాల వద్ద గల గద్దెపైకి చేర్చారు. శనివారం ఉదయం పొలాల వద్దకు రైతులు వెళ్లి చూసేసరికి ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి, ఆయిల్ పారబోసి కాపర్ వైర్‌ను ఎత్తుకెళ్లినట్లు ఉంది. దీంతో వారు విద్యుత్, పోలీస్ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. లైన్‌మెన్ ప్రవీణ్, కానిస్టేబుల్ రఘు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కాపర్‌వైర్ చోరీ ఘటనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్నట్లు రైతు శ్రీనివాస్ తెలిపారు.

మండలంలో 8,200 కుటుంబాల సర్వే పూర్తి

కాటారం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి):మండలంలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణన(సమగ్ర ఇంటింటా కుటుంబ సర్వే)ప్రక్రియ కొనసాగుతున్నది. శనివారం 24జీపీల పరిధిలో 89మంది ఎన్యుమరేటర్లు 1010కుటుంబాల సర్వే పూర్తి చేయగా ఇప్పటివరకు మండలంలోని 12,191కుటుంబాలకు గానూ 8,200కుటుంబాల సర్వే పూర్తయినట్లు అధికారులు తెలిపారు. సర్వే జరుగుతున్న తీరును ఎంపీడీవో బాబు, తహసీల్దార్ నాగరాజు పర్యవేక్షించారు. సర్వేకు ప్రతీ ఒక్కరు సహకరించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు, ఎన్యుమరేటర్లు తదితరులున్నారు.

రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దు

గోవిందరావుపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గోవిందరావుపేటలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పస్రా ఎస్సై కమలాకర్ శనివారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన కొనుగోలు కేంద్రం నిర్వాహకుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలకు వరి ధాన్యాన్ని తరలించి మద్దతు ధర పొందాలని కోరారు. ఏమైనా సమస్యలు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎవరైనా అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. తూకాలు, కాంటాల విషయంలో జాగ్రత్త వహించాలని సూచించారు.



నిర్వాహకులకు సూచనలు చేస్తున్న ఎస్సై కమలాకర్

పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స చేయించాలి

భూపాలపల్లి కృష్ణకాలనీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స చేయించాలని భూపాలపల్లి మండల పశువైద్యాధికారి డాక్టర్ తిరుపతి సూచించారు. శనివారం భూపాలపల్లి మండలంలోని నేరేడుపల్లి, కొత్తపల్లి గ్రామాల్లో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా 40 పశువులకు గ ర్భకోశచికిత్సలు అందించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పశువులు యదకు వచ్చినప్పుడు లింగనిర్ధారిత వీర్యంతో గర్భదారణ చ్తే మేలు జాతి ఆడ దూడలు వృద్ధి చెందుతాయన్నారు. అలాగే, దూడలకు నట్టల నివారణ మందులను త్రాగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆజాంనగర్ డాక్టర్ ప్రశాంత్, గోపాల మిత్ర సూపర్వైజర్ ప్రకాష్‌రెడ్డి, గోపాల మిత్రలు రమేష్, చక్రపాణిలు పాల్గొన్నారు.

● వెంకటాపూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇంచెంచెరువుపల్లి గ్రామంలో పశు గణాభివృద్ధి సంస్థ ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో శనివారం ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం జరిగింది. ఈసందర్భంగా ములుగు జిల్లా పశువైద్య శాఖ అధికారి డాక్టర్ కె.కొమురయ్య పాల్గొని 75 దూడలకు నట్టల నివారణ మందులు వేయడంతోపాటు 124పశువులకు గర్భస్థ వ్యాధి నివారణ మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగనిర్ధారిత వీర్యంతో కృత్రిమ గర్భధారణ చేయడం వల్ల కలిగే లాభాలను రైతులకు వివరించారు. గోపాలమిత్ర సూపర్‌వైజర్ ఐలుమల్లు, గోపాలమిత్రలు శ్రీనివాస్, సత్తిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.



వెంకటాపురం: పశువులకు చికిత్స అందిస్తున్న వైద్యులు

వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వద్దు

సమీక్ష సమావేశంలో డీఎంహెచ్‌వో గోపాల్‌రావు

ములుగు కలెక్టరేట్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సహాయం అందడంలో పర్యవేక్షకుల పాత్ర ముఖ్యమైనదని డీఎంహెచ్‌వో గోపాల్‌రావు అన్నారు. ములుగులోని జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో శనివారం ఆరోగ్యకేంద్రాల సూపర్‌వైజర్లు, ఆరోగ్య కార్యకర్తలతో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆరోగ్య కార్యక్రమాల లక్ష్య సాధనలో పర్యవేక్షకులు సరైన పనితీరును అవలంభించకపోతే శాఖాపరమైన చర్యలు ఉంటాయని, లక్ష్యసాధన, కాలపరిమితిని దృష్టిలో పెట్టుకుని నిర్దిష్టమైన సూక్ష్మ ప్రణాళికలు తయారు చేసుకుని వాటికి అనుగుణంగా కిందిస్థాయి ఉద్యోగులను సమన్వయపరచుకుని లక్ష్యాన్ని సాధించాలన్నారు. జాతీయ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ప్రతి వారంలో బుధ, శనివారాల్లో నిర్వహించి పిల్లలకు ముందస్తుగానే టీకాల సమయాన్ని, తేదీని తెలియపరిచి టీకాలు వేయించుకునేందుకు పిల్లలు వచ్చేలా ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా గర్భిణుల నమోదు, ప్రభుత్వ ఆస్ప త్రుల్లో ప్రసవాలు ఎక్కువగా జరిగేవిధంగా చూడాలన్నారు. అసంక్రమిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమం మూడవ ఫేజ్ వచ్చే ఫిబ్రవరి వరకు పూర్తి చేయాలన్నారు. మలేరియా, డెంగ్యూ వ్యాధుల పట్ల ఆశాలు, ఆరోగ్య కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని, టీబీ కేసుల నమోదు, స్క్రీనింగ్‌లను పెంచేందుకు పీహెచ్‌సీల్లో ముందస్తు సూక్ష్మ ప్రణాళికలు తయారు చేసుకుని టీబీ రోగులను గుర్తించి వారికి మందులు పంపిణీ చేయాలన్నారు. ఈసమావేశంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్లు పవన్‌కుమార్, శ్రీకాంత్, రణధీర్, ఇన్‌చార్జి మాస్ మీడియా ఆఫీసర్ సంపత్, ఏఎంవో దుర్గారావు, డీపీహెచ్‌ఎంవో శకుంతల, డీపీఎంలు సాంబయ్య, సంజీవరావు, సత్యనారాయణ, సబ్ యూనిట్ ఆఫీసర్‌లు వెంకటరెడ్డి, భూపాల్‌రెడ్డి, సాంబయ్య, నాగేశ్వర్‌రావు, మెడిసిన్ స్టోర్ ఇన్‌చార్జి వినోదర్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో గోపాల్‌రావు

సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

వెంకటాపూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష పరిధిలోని విద్యాశాఖలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏళ్ల మధుసూదన్ శనివారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్లుగా అన్ని అర్హతలు ఉండి చాలీచాలని వేతనాలతో జీవితాలను వెళ్లదీసుకుంటూ సాధారణ ఉద్యోగుల కంటే ఎక్కువ గంటలు పనిచేస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వ పాలనలో సమగ్రశిక్ష ఉద్యోగులు 30రోజులపాటు చేపట్టిన నిరవధిక సమ్మెలో సీఎం రేవంత్‌రెడ్డి పా ల్గొని రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చారని అన్నారు. హామీని నిలబెట్టుకోవాలన్నారు.

బాధితుడికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

వెంకటాపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరవీడు గ్రామానికి చెందిన రాజేష్‌కు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.60వేల విలువైన చెక్కును కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం మండల కేంద్రంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పాయం రమణ, పీఏసీఎస్ అధ్యక్షుడు చిడెం మోహన్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, నాయకులు గార్లపాటి రవి, యాలం సాయి తదితరులు పాల్గొన్నారు.

108 సిబ్బందిపై చర్య తీసుకోవాలి

మహదేవపూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మహదేవపూర్ సీహెచ్‌సీ పరిధిలో శనిగరం బాపురెడ్డి అనే వ్యక్తి గుండె సంబంధిత ఆస్పత్రికి రాగా అక్క డి వైద్యుడు హార్ట్ ఇబ్బంది అని 108కు ఫోన్ చేయగా అందుబాటులో లేదని చెప్పారని ప్యాక్స్ చైర్మన్ చల్లా తిరుపతిరెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం మహదేవపూర్‌లో ఆయన మాట్లాడారు. కారులో సదరు బాధితుడిని తీసుకెళ్లి మళ్లీ ఫోన్ చేయగా భూపాలపల్లి అంబులెన్స్ అందుబాటులోకి వచ్చిందన్నారు. సదరు అంబులెన్స్ సిబ్బంది మధ్యలోనే కలెక్టర్ ఆఫీస్ వద్ద తమ మేనేజర్ వద్దన్నాడని హార్ట్ పేషెంట్‌ను దింపేశారని తెలిపారు. ఓ వ్యక్తి ప్రమాదంలో ఉన్నా నిర్లక్ష్యంగా ఉన్న 108 సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని తిరుపతిరెడ్డి తెలిపారు.

ఎంఎస్‌పీ పట్టణ అధ్యక్షుడిగా రవి ఎన్నిక

భూపాలపల్లిటౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్‌పీ) భూపాలపల్లి పట్టణ అధ్యక్షుడుగా రేణుకుంట్ల రవిని ఏకగ్రీవంగా ఎన్నిక చేసినట్లు ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జి చంద్రమౌళి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత కొన్నేళ్లుగా పార్టీకి, సంఘానికి ఎనలేని కృషి చేయడంపై సంతృప్తి చెంది ఎంఎస్‌పీ పట్టణ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు.

మృతుడి కుటుంబానికి సరుకుల పంపిణీ

వెంకటాపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బీసీమర్రిగూడెం గ్రామానికి చెందిన నాగరాజు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబసభ్యులను జిల్లా మహిళా, శిశు సంక్షేమశాఖ, ఒయాసిస్ ఆర్ఫాన్స్ చారిటబుల్ ట్రస్టు సభ్యులు శనివారం పరామర్శించారు. ఈసందర్భంగా బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులు, దుప్పట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ అధికారి శిరీష, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ చంద్రకళ, ఒయాసిస్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు ఒద్దిరాజు చంద్రప్రకాష్ పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల గోడ పత్రిక ఆవిష్కరణ

భూపాలపల్లిటౌన్, న వంబరు 16: ఈ నెల 21న తెలంగాణ ముదిరాజ్‌ల మహాసభ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా శనివారం ఆ సంఘం నాయకులు గోడ పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్, భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు జోరుక సదయ్య, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సారంగపాణి మాట్లాడుతూ ఈ మహాసభను విజయవంతం చేయడానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిలుకల పాణి, వేముల రాజమౌళి, చాద కృష్ణమూర్తి, మొగిలి, తిరుపతి, సురేష్, సంతోష్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

18న ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక

వెంకటాపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఈనెల 18న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 16వ విడత సామాజిక ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజావేదికలో ఏప్రిల్, 2023 నుంచి మార్చి 2024 వరకు 18పంచాయతీల్లో జరిగిన ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ చేసిన నివేదికను ప్రజావేదికలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. పలు అంశాలపై చర్చ ఉంటుందని తెలిపారు.

టాక్సీ, మోటార్ క్యాబ్ సబ్సిడీల రద్దు

భూపాలపల్లిటౌన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి) : పరిశ్రమలశాఖ నుంచి టాక్సీ, మోటార్ క్యాబ్ సబ్సిడీలను రద్దు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని భూపాలపల్లి జిల్లా ఇండస్ట్రియల్ మేనేజర్ సిద్ధార్థ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న టీ-ప్రైడ్‌లో భాగంగా ఎస్సీ, ఎస్టీ దివ్యాంగులకు గతంలో మోటార్ క్యాబ్‌లు, టాక్సీలు ఇచ్చారని, కానీ ఇప్పుడు 2024 డిసెంబరు 1 నుంచి నిలిపివేయడం జరుగుతుందని తెలిపారు. ఇది పరిశ్రమల శాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు ప్రకటన చేయడం జరిగిందన్నారు.

హామీల అమలులో వేగం పెంచాలి

కాకతీయఖని, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో వేగం పెంచాలని సీపీఐ రాష్ట్ర సహాయకార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని రావి నారాయణరెడ్డి భవన్‌లో జరిగిన సీపీఐ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల విషయంలో ఒక్క అడుగు ముందుకు రెండు అడుగులు వెనక్కి అన్న చందంగా ఉందన్నారు. పథకాల అమలులో వేగం పెంచి అర్హులైన వారికి న్యాయం చేయాలన్నారు. సీపీఐ నాయకులు రాజ్‌కుమార్, ప్రవీణ్, సమ్మిరెడ్డి, సుగుణ, చంద్రమౌళి, రాజేందర్, రాజయ్య, రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక భద్రత పథకంపై అవగాహన

గోవిందరావుపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చాపరాయి, పందిరిదోన గ్రామాల్ల సామాజిక భద్రత పథకంపై శనివారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా హ్యాండ్ ఇన్ హ్యాండ్ ఇండియా, సహసంక జిల్లా కోఆర్డినేటర్ స్వప్న పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ఉచిత బీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాల న్నారు. ఈ సదస్సులో మాజీ సర్పంచ్ ఏలేంద్ర , సఖి కేంద్రం సిబ్బంది మౌనిక, రాధ, నగేష్, హ్యాండ్ ఇన్ హ్యాండ్ ఇండియా కోఆర్డినేటర్ చందు పాల్గొన్నారు.

జిల్లాలో 61.7శాతం కుటుంబాల సర్వే పూర్తి

భూపాలపల్లి కలెక్టరేట్, నవంబరు16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సామాజిక ఆర్థిక సర్వే శనివారం వరకు 61.7శాతం పూర్తి అయినట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి ఎన్యూమరేటర్లు 86,518 కుటుంబాల సర్వేను పూర్తి చేశారు. గురువారం 11,365 ఇండ్లల్లో సర్వేను పూర్తి చేశారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కారు

- ఇద్దరు గీతకార్మికులకు తీవ్ర గాయాలు



రోడ్డు ప్రమాద దృశ్యం

ములుగు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ములుగు మండలం జాకారంలో శనివారం ఉదయం 163వ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు గీతకార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. అబ్బాపురం గ్రామానికి చెందిన మోటపోతుల భద్రయ్య, ఉయ్యాల బాబు కల్లుగీత వృత్తి చేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. శనివారం ఉదయం వృత్తిలో భాగంగా ఒకే ద్విచక్ర వాహనంపై జాకారం వచ్చారు. తిరుగు ప్రయాణంలో రోడ్డు దాటుతుండగా హనుమకొండ నుంచి ములుగు వైపు వస్తున్న కారు వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇరువురు గీతకార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని 108అంబులెన్స్‌లో హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. ప్రమాదానికి అతివేగమే కారణమని తెలుస్తోంది. ఘటనాస్థలికి చేరుకున్న ఎస్సై వెంకటేశ్వర్‌రావు పరిస్థితిని సమీక్షించారు. ప్రమాదానికి గురైన వాహనాలను అక్కడి నుంచి తరలించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

ఆయిల్‌పామ్‌ను ప్రత్యామ్నాయంగా సాగుచేయాలి

వెంకటాపూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు సాగునీటి ఎద్దడి, మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకుని ఆయిల్‌పామ్‌ను ప్రత్యామ్నాయ పంటగా సాగుచేయాలని కేన్ బయోసైన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకులు సుధారెడ్డి అన్నారు. మండలంలోని ఆకులవారిపల్లి, వెల్తుర్లపల్లి గ్రామాల్లోని ఆయిల్ పామ్ తోటలను ఆమె శనివారం సందర్శించారు. ములుగు జిల్లాలో ఇప్పటివ రకు 3వేల ఎకరాల ఆయిల్‌పామ్ పంట సాగవుతుందని తెలిపారు. సంస్థ ప్రతినిధులు హేమంత్‌కుమార్, నవీన్, శవకృష్ణ, కరుణాకర్, రైతులు పాల్గొన్నారు.